ముగ్గురికి పాముకాటు

పోలవరం: పాముకాటుతో ముగ్గురు రైతులు అస్వస్థతకు గురైన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.కృష్ణంరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోలవరం పంచాయతీ కొత్త రామయ్యపేట గ్రామానికి చెందిన రైతులు మేడూరి ఏడుకొండలు, సుంకర అవతారం పొలాల్లో వేర్వేరుచోట్ల పని చేస్తుండగా పాముకాటుకు గురయ్యారు. ఇటుకలకోట పంచాయతీ కొత్త పైడిపాక గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ యంగల రాజేష్ పొలంలో పని చేస్తుండగా పాముకాటుకు గురై అస్వస్థతకు గురయ్యాడు. ఆ ముగ్గురిని పోలవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకురావడంతో వారికి పాముకాటు విరుగుడు ఇంజెక్షన్లు ఇచ్చి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. కాటు వేసిన పాము జాతి తెలియకపోవడం వల్ల తాము పర్యవేక్షణలో ఉంచామని వైద్యులు తెలిపారు. వర్షాల సీజనులో రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజానీకం విషసర్పాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గోదా'వర్రీ'..!

- అల్పపీడన ప్రభావంతో జోరుగా వర్షాలు
- మరోసారి గోదావరికి వరద
- పోలవరం స్పిల్‌వే వద్ద 28 మీటర్లకు చేరిన నీటిమట్టం
- దిగువకు రెండు లక్షల క్యూసెక్కులకుపైగా నీరు విడుదల
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల జోరు ఒకపక్క, ఎగువ నుంచి వస్తున్న వరదపోటుతో గోదావరికి వరద ఉధృతి రోజురోజుకీ పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 20 అడుగులు దాటేసింది. పోలవరం స్పిల్‌వే వద్ద నీటిమట్టం 28 మీటర్లకు చేరింది. దీంతో రెండు లక్షల క్యూసెక్కులకుపైగా నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. గోదావరికి వరద పోటు పెరుగుతుండటంతో ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుల్లోని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ నెల మొదటివారంలో గోదావరికి పెద్దఎత్తున వరద వచ్చింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 41 అడుగులకు చేరింది. 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని గొమ్ముగూడెం, రేపాకగొమ్మి వంటి పలు గ్రామాలకు చెందిన ప్రజలను పునరావాస కాలనీలకు తరలించారు. మరికొన్ని గ్రామాల ప్రజలు చల్లావారిగూడెంలోని కాలనీలోకి తరలివెళ్లారు. ఇంతలో గోదావరి తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పునరావాస కాలనీలకు తరలివెళ్లిన జనం తిరిగి ఊళ్లకు చేరుకోగా, కొంతమంది అక్కడే ఉండిపోయారు. ఇక గోదావరి వరద భయం తప్పినట్టే అనుకుంటున్న తరుణంలో మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ నుంచి భారీగా నీరు

వస్తుండటంతో గోదావరికి వరద ముప్పు పొంచి ఉంది. దీంతో నిర్వాసిత గ్రామాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

ప్రభుత్వ తప్పిదాలకు నిర్వాసితుల అవస్థలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పిదాలకు పోలవరం నిర్వాసితులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రతియేటా జులై, ఆగస్టుల్లో వచ్చే వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వందకుపైగా గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 30 అడుగులు దాటేసరికి గుండేటి వాగుపై కాజ్‌వే, ఎద్దువాగుపై కాజ్‌వే నీటమునిగి వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని దాదాపు 35కుపైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. గొమ్ముగూడెం, రాపాకగొమ్మి, రుద్రంకోట, కొయిదా వంటి అనేక గ్రామాల ప్రజలు పునరావాస కాలనీలకు, కొండలు, గుట్టలపైకి తరలిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. 41.15 కాంటూరు పరిధిలో ముంపు గ్రామాలకు పూర్తిస్థాయిలో పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా చేయలేదు. నిర్వాసిత కాలనీల్లో ఇంటి నిర్మాణాలు పూర్తి కాలేదు. ఇంటి స్ట్రక్చర్ వాల్యూయేషన్‌కు సంబంధించిన సొమ్ము ఇవ్వలేదు. 18 ఏళ్ల నిండిన యువతకు పరిహారం అందించలేదు. పరిహారం పూర్తిస్థాయిలో ఇవ్వకుండా బలవంతంగా నిర్వాసితులను పంపించే ఆలోచనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నట్లు కన్పిస్తోంది. 45.72 కాంటూరు పరిధిలో ఉన్న గ్రామాలు సైతం ఓ మోస్తరు వరదకే మునిగిపోతున్నాయి. కాంటూరు లెక్కల్లో తప్పిదాల కారణంగా ఇటువంటి పరిస్థితి ఏర్పడింది. తమ గ్రామాలను 41.15 కాంటూరు పరిధిలో చేర్చి తొలిదశలో ఖాళీ చేయించే గ్రామాల్లో చేర్చాలని అనేక గ్రామాలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రతియేటా గోదావరి వరదలకు నిర్వాసితులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మరోసారి గోదావరికి వరద పెరుగుతుండటంతో ముంపు గ్రామాల నిర్వాసితులు భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి వరద

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదులుతుండటంతో గోదావరికి భారీగా వరద నీరు చేరుతోంది. భద్రాచలంలో గోదావరి నీటిమట్టం 21 అడుగులకు చేరి క్రమంగా పెరుగుతుండటంతో ముంపు మండలాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే రైతులు పత్తి సాగు పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈసారి పత్తిని వరద ముంచెత్తితే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేలేరుపాడు రూరల్: భారీ వర్షాలకు గోదావరి క్రమేపీ పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 34 అడుగులకు చేరితే మండలంలోని 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఓపక్క వర్షాలు, మరోపక్క వరద భయంతో ప్రజలు

కిరాయిలు లేక నిలిచిన ఆటోలు

ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోల యజమానులు, డ్రైవర్లు జోరున వర్షం కురుస్తుండటంతో కిరాయిలు లేక ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నారు.

ఆందోళనలో ముంపు గ్రామాల ప్రజలు

ప్రతియేటా ఈ కష్టాలు తప్పేదెన్నడో అని ఆవేదన

పోలవరం: ఎగువన గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉపనదులు శబరి, సీలేరు, మంజీర, ప్రవర, ఇంద్రావతి, కొండవాగుల జలాలు ఉప్పొంగి గోదావరిలో కలుస్తున్నాయి. దీంతో గోదావరి నీటిమట్టం గురువారం నాటికి అసాధారణ రీతిలో పెరిగింది. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 2,37,203 క్యూసెక్కుల నీటిని జలవనరులశాఖ అధికారులు స్పిల్వే 48 గేట్ల నుండి దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్వే ఎగువన 28.330 మీటర్లు, దిగువన 18.530 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 28.500 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 17.900 మీటర్లు, ప్రాజెక్ట్ ఎగువ దిగువ కాఫర్ డ్యాముల మధ్య 15.990 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గురువారం రాత్రి పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 6.78 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు

డ్వాక్రా రుణాల లక్ష్యాలను సాధించాలి

డిఆర్‌డిఎ అధికారులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు నిర్దేశించిన మేర రుణ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు, ఉపాధి యూనిట్ల గ్రౌండింగ్ తదితర అంశాలపై ఏలూరు కలెక్టరేట్ నుండి డిఆర్‌డిఎ ఎపిఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. జిల్లాలో ఇంతవరకు 15,353 స్వయం సహాయక సంఘాలకు రూ.1145.20 కోట్లు రుణాలను మంజూరు చేసేందుకు అవసరమైన మైక్రో క్రెడిట్ ప్లానులను బ్యాంకులకు అందించామన్నారు. 2,888 స్వయం సహాయక సంఘాలకు రూ.237 కోట్లు బ్యాంకులు ఆమోదించాయని, మిగిలిన రుణాలను కూడా ఆమోదించేలా డిఆర్‌డిఎ అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. రుణాల మంజూరుకు సంబంధించి మైక్రో క్రెడిట్ ప్లాన్ రూపొందించడంలో స్వయం సహాయక సంఘాలకు ఏదైనా సమస్య ఎదురైతే వాటిని తెలుసుకుని పరిష్కరించేందుకు డిఆర్‌డిఎ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం ఉపాధి నిమిత్తం రుణాలు మంజూరు పొందిన సంఘాల యూనిట్లను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, వారికి యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారం, వాటి ఉత్పత్తులకు అవసరమైన మార్కెటింగ్ సౌకర్యాలు అందించేలా డిఆర్‌డిఎ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరును వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎల్‌డిఎంను కలెక్టర్ కోరారు. ప్రగతి సాధనలో వెనుకబడి ఉన్న టి.నర్సాపురం, పెదవేగి, చాట్రాయి, జీలుగుమిల్లి, దెందులూరు, నూజివీడు మండలాలకు సంబంధించిన డిఆర్‌డిఎ సిబ్బందిని అందుకు గల కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రుణాల మంజూరులో ప్రగతి చూపాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎల్‌డిఎం నీలాద్రి, ఎపిఎంలు, సీసీలు పాల్గొన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

యూరియాను వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అవసరాలకు దారి మళ్లిస్తే దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. ఎరువుల డీలర్లు, సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అవసరమైనన్ని ఎరువులను సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఎరువుల దుకాణాలు, గోడౌనులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు వ్యవసాయ శాఖాధికారులతో కూడిన బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఎరువులను దారిమళ్లించేందుకు ఎంతమాత్రం వీలులేదని, దీనిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. పరిమితికి మించి ఎరువుల వినియోగం వల్ల తలెత్తే సమస్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నానో యూరియా, సమగ్ర పోషక యాజమాన్యంపై రైతులను చైతన్యపర్చాలన్నారు. జిల్లాలో పెద్దఎత్తున డ్రోన్లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఆక్వాసాగుకు యూరియా తదితర ఎరువుల సరఫరా కాకుండా నియంత్రించాలన్నారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందుల నిల్వలను తెలియజేసే రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. వాటిని మండల వ్యవసాయ అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఇ-క్రాప్ నమోదు, బయోమెట్రిక్ ఆధారంగా ఎరువులను రైతులకు అందించాలన్నారు. సమావేశంలో ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ భాషా, మార్క్‌ఫెడ్ డిఎం ప్రసాద్‌గుప్తా, డిసిఒ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అల్పపీడన ప్రభావంతో మండలవ్యాప్తంగా గురువారం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకల్లోకి వరద నీరు చేరుతోంది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో కామయ్యపాలెం వాగు, అశ్వారావుపేట వాగుల గుండా వరద ప్రవాహం పోటెత్తుతోంది. వరి నారుమడుల్లోకి నీరు చేరడంతో వ్యవసాయ పనులకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జాతీయ రహదారి పనుల్లో వర్షపు నీరు చేరడంతో పనులు నిలిచిపోయాయి.

పరవళ్లు తొక్కుతున్న డ్రెయిన్లు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మేజర్, మైనర్, మీడియం డ్రెయిన్లన్నీ పరవళ్లు తొక్కుతున్నాయి. భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వర్షపు నీరు మురుగు కాలువల్లోకి వచ్చి చేరుతుంది. దీంతో మండలంలోని డ్రెయిన్లన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. పోల్‌రాజ్, పెదలంక, అన్నవరం డ్రెయిన్లతోపాటు మీడియం, మైనర్ డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం అంతా ఈ డ్రెయిన్లు ద్వారానే ఉప్పుటేరులో కలుస్తోంది. పలు డ్రెయిన్ల గట్లు బలహీనంగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ డ్రెయిన్లకు ఎక్కడ గండి పడుతుందోనని ఆయకట్టు రైతులు బెంబేలెత్తుతున్నారు. ఈ వర్షాలు ఇదే మాదిరిగా కొనసాగితే గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో గండి పడే ప్రమాదం ఉందని రైతులంటున్నారు. పలు గ్రామాల్లో డ్రెయిన్ల వద్ద వంతెన ఖానాలకు గుర్రపు డెక్క, నాచు దట్టంగా పేరుకుపోవడంతో మురుగునీరు ప్రవాహానికి ఆటంకంగా మారింది. అధికారులు స్పందించి గుర్రపుడెక్క తొలగింపు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రెయిన్

పునరావాస కాలనీలో సౌకర్యాలు కల్పించాలి

సిపిఎం బృందం డిమాండ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చల్లావారిగూడెం పునరావాస కాలనీలో నిర్వాసితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం సకల సౌకర్యాలు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల బృందం గురువారం ఆ కాలనీలో పర్యటించింది. నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ జాతీయ ప్రాజెక్టు కోసం తమ జీవితాలను త్యాగం చేసిన నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డున పడేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.లక్షల కోట్లు బడ్జెట్ కేటాయిస్తున్న ప్రభుత్వాలు కాంట్రాక్టర్లకు పెద్దపీట వేస్తున్నాయని, నిర్వాసితులను కట్టుబట్టలతో రోడ్లపై వదిలేశాయని విమర్శించారు. ప్రాజెక్టు పునాదులు వేసి 20 సంవత్సరాలు కావొస్తున్నా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు మాటలకే పరిమితమవుతున్నారన్నారు. కాలనీలో ఇళ్ల శ్లాబ్‌లు వర్షాలకు కారిపోతున్నాయన్నారు. తాగునీరు సదుపాయం లేక దాహార్తితో అలమటిస్తున్నారన్నారు.

నినదిస్తున్న సిపిఎం నేతలు

ఇదేనా నిర్వాసితుల పట్ల ప్రభుత్వం ప్రదర్శించే చిత్తశుద్ధి అని నిలదీశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిర్వాసితుల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఉపాధి చూపాలని, ప్రతి కుటుంబానికీ ఆర్థిక సహాయం రూ.పది వేలు తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేతలు పఠాన్ మస్తాన్, అందుగుల ప్రభాకర్‌రావు, పి.పోతురాజు, పి.వీర్రాజు, గట్టియా, పి.చంటి, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

మట్టి ఖర్చుల మాటేంటి..!

- ప్రభుత్వ పెన్షనర్లు మరణిస్తే పట్టని ప్రభుత్వం
- ఒక్కొక్కరికీ రూ.25 వేలు చెల్లిస్తామని మొండిచెయ్యి
- జిల్లాలో నాలుగు నెలల్లో 164 మంది మృతి
- ఏప్రిల్ ఒకటి నుంచి నిలిచిన చెల్లింపులు
- ఎదురుచూస్తున్న పెన్షనర్ల కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ పెన్షనర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న వారి పరిస్థితి ప్రస్తుతం మరింత దయనీయంగా మారింది. చనిపోయిన తర్వాత మట్టి ఖర్చులు ఇవ్వకుండా మొండిచెయ్యి చూపుతోంది. ఈ నాలుగు నెలల కాలంలో ఎంతోమంది పెన్షనర్లు మృతి చెందినప్పటికీ కుటుంబ సభ్యులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి చెల్లింపులు నిలుపుదల చేయడంతో పెన్షనర్ల కుటుంబ సభ్యులు మట్టి ఖర్చుల సొమ్ము కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

వివిధ విభాగాల్లో ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఉద్యోగ కాలమంతా అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నా, ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుండటం బాధాకరం. పెన్షనర్ మరణించిన తర్వాత కూడా వారి కుటుంబ సభ్యులకు సమస్యలు తప్పట్లేదు. ప్రభుత్వ పెన్షనర్లు మరణిస్తే మట్టి ఖర్చుల కింద ఒక్కొక్కరికీ రూ.పది వేలతోపాటు ఒక నెల పెన్షన్ ప్రభుత్వం అందించేది. తర్వాత దీన్ని రూ.15 వేలకు పెంచారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నెల పెన్షన్ ఇవ్వకుండా మట్టి ఖర్చుల కింద ఇచ్చే మొత్తాన్ని రూ.25 వేలకు పెంచింది. ఎవరైనా పెన్షనర్ మరణిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పది రోజుల్లో ఆ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాకు ట్రెజరీ అధికారులు సొమ్ము జమ చేసేవారు. గడిచిన నాలుగు నెలలుగా పెన్షనర్ మరణించినా మట్టి ఖర్చు సొమ్ము రావడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకూ 164 మంది వరకూ మృతి చెందారు. గతంలో ఎన్నడూ ఈ నిధుల విడుదలలో ఏ ప్రభుత్వమూ జాప్యం చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదట్లో నిధులు విడుదల చేసినప్పటికీ తర్వాత నిలుపుదల చేయడంతో పెన్షన్‌దారుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకూ ట్రెజరీల వారీగా భీమవరంలో 41 మంది, తాడేపల్లిగూడెంలో 32, పాలకొల్లులో 25, తణుకులో 32, పెనుగొండలో 9, నరసాపురంలో 16, ఆకివీడులో 10 మంది వరకూ చనిపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే నెలలు తరబడి మట్టి ఖర్చు సొమ్ము ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో పెన్షన్‌దారుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం

చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రభుత్వం తీరు పట్ల విస్మయం వ్యక్తం చేస్తోంది.

మనోవేదన పట్టించుకోకపోవడం దారుణం

గాతల జేమ్స్, ఎపి ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

ప్రభుత్వ రంగంలో దీర్ఘకాలం పని చేసి అనేక సేవలందించి ఉద్యోగ విరమణ తర్వాత సంబంధిత ఉద్యోగిని కనీసం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చనిపోయినా కూడా కనీసం ప్రభుత్వం నుంచి సాయం అందడం లేదు. పెన్షనర్ల కుటుంబ సభ్యుల మనోవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మట్టి ఖర్చుల నిలుపుదల ఎంతవరకూ సమంజసం. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా.

2018 నుంచి ఎరియర్స్ ఇవ్వట్లేదు

పి. సీతారామరాజు, ఎపి ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, భీమవరం యూనిట్ కార్యదర్శి

2018 నుంచి ఎరియర్స్ ఇవ్వడం లేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు చనిపోయారు. ఎరియర్స్ ఇవ్వకపోవడం వల్ల చాలా నష్టపోయారు. చనిపోతే కనీసం మట్టి ఖర్చులు ఇవ్వకపోవడంతో పెన్షనర్ల పట్ల ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతోంది. ఏప్రిల్ నుంచి భీమవరం పరిధిలో 25 మంది వరకూ పెన్షనర్లు చనిపోయారు. వీరి కుటుంబాలు మట్టి ఖర్చుల సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారు.

సమస్యలతో పెన్షనర్లు సతమతం

సాగిరాజు సత్యనారాయణరాజు, ఎపి ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగం కత్తి మీద సాములా మారింది. ఇబ్బందులు అధిగమించి ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా పెన్షనర్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. జిల్లాలో నాలుగు నెలల్లో ఎంతోమంది పెన్షనర్లు చనిపోయారు. వారికి ఇప్పటివరకు మట్టి ఖర్చులు ఇవ్వకపోవడం దారుణం.

8 నెలల నుంచి మట్టి ఖర్చులు ఇవ్వలేదు

సిహెచ్.వెంకటేశ్వరరావు, రాయకుదురు

నా తండ్రి ఆదినారాయణ ఉపాధ్యాయులుగా పనిచేశారు. గతేడాది డిసెంబర్ 26న మృతి చెందారు. అప్పట్లో మట్టి ఖర్చులకు డబ్బులు ఇస్తామన్నారు. ఇప్పటికి ఎనిమిది నెలలైనా సొమ్ము రాలేదు. ఏమైందో తెలీదు. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి ఏం చేయాలో తెలియని పరిస్థితి. ప్రభుత్వ ఉద్యోగిగా అనేక సేవలందించినా సమస్యను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మట్టి ఖర్చులు జమ చేయాలని కోరుతున్నాం.

సిపిఎం నగర కార్యదర్శిగా పి.రవికుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎం ఏలూరు నగర కార్యదర్శిగా పంపన రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ ప్రకటించారు. గురువారం సిపిఎం నగర కమిటీ సమావేశం జి.రవికిషోర్ అధ్యక్షతన ఉద్దరాజు రామం భవనంలో జరిగింది. సమావేశ వివరాలను ప్రసాద్ పత్రికలకు విడుదల చేశారు. సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి హాజరై మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమన్నారు. జిల్లా కేంద్రం ఏలూరు నగరంలో ఇళ్ల స్థలాలు లేని పేదలు అద్దె ఇళ్లకు కిరాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించడంలో కాలయాపన ఎందుకని ప్రశ్నించారు. స్మార్ట్‌మీటర్లు పేరుతో ప్రజలపై రూ.కోట్ల భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. ప్రధాన పరిశ్రమలుగా ఉన్న జ్యూట్‌మిల్లులు మూతపడటంతో ఉపాధి లేక కార్మికులు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉపాధి పెంచే కార్యాచరణ పాలకుల వద్ద కూడా లేకుండాపోయిందన్నారు. ఏలూరు నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వైఎస్.కనకారావు, ఎం.ఇస్సాక్, కడలి రామాంజనేయులు, వివిఎన్.ప్రసాద్, పి.హైమావతి, ఎం.అరుణకుమారి, జె.గోపీ పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి దాతల సాయం హర్షణీయం

ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు



ప్రారంభోత్సవంలో ధర్మరాజు, గన్ని వీరాంజనేయులు

దాతల సహకారంతో గ్రామాలు అభివృద్ధి చెందడం హర్షణీయమని ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. కాగుపాడులో దాతల సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రవాసాంధ్రురాలు (ఆమెరికా) డాక్టర్ పూదోత సునీత రూ.7 లక్షలు సాయం అందించారు. ఆ సొమ్ముతో గ్రామంలో రూ.3 లక్షలతో సీసీ కెమెరాలు, రూ.4 లక్షలతో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించారు. కంప్యూటర్లు, ప్రింటర్, బ్యాటరీ ఇన్వర్టర్, డ్రెస్సింగ్ టేబుల్, థియేటర్ లైట్, జనరల్ వార్డులో ఎసిలు తదితర వసతులను ఏర్పాటు చేయగా, వాటి ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎతోపాటు ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పొట్ల ఏడుకొండలు, నారాయణపురం సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి కడియాల రవిశంకర్, బిజెపి నేత శరణాల మాలతీరాణి, ఆసుపత్రి వైద్యులు పి.మానస, ఇ.అనూష, ఎంపిడిఒ రాజ్‌మనోజ్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ పూర్ణచంద్రప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు ఇమ్మణ్ణి గంగాధర్, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలపై దాడి కేసు సిఐడికి అప్పగింత

ప్రజాశక్తి - పాలకొల్లు

గత వైసిపి ప్రభుత్వంలో మంత్రి నిమ్మల రామానాయుడుపై జరిగిన దాడికి సంబంధించి కేసును సిఐడికి అప్పగించారు. అప్పట్లో దాడి ఘటనపై పాలకొల్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, వైసిపి ప్రమేయంతో కేసు నమోదు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2022లో చేసిన ఫిర్యాదు మేరకు కేసుగా నమోదు చేశారు. నరసాపురం డిఎస్‌పి విచారణ నేపథ్యంలో తాజాగా దీనిపై లోతుగా దర్యాప్తు జరిపేందుకు సిఐడికి బదలాయిస్తూ డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ సిఐడి డిఎస్‌పి మోహన్ నేతృత్వంలో అయిదుగురు సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేశారు.

వివరాల్లోకి వెళ్తే.. 2022లో వైసిపి ప్రభుత్వ హయాంలో పాలకొల్లు పట్టణంలోని టిడ్కో గృహాల కాలనీ వద్ద ఇళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. అప్పటి మంత్రులు ఆదిమూలం సురేష్, కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యన్నారాయణ, అప్పటి నర్సాపురం ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు. ప్రొటోకాల్ ప్రకారం ఇళ్ల పంపిణీ సభకు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అధ్యక్షత వహించాల్సి ఉంది. అయితే అధికారుల పిలుపు మేరకు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, అప్పటి ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ వేదికపైకి ఎక్కుతుండగా ప్రొటోకాల్ లేకుండా సభావేదికకు సంబంధం లేని వైసిపి కార్యకర్తలు, మరి కొంతమంది కిరాయి మూకలు వారిని వేదికపైకి రాకుండా నిరోధించి వారిపై భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో నిమ్మల రామానాయుడుకు రక్షణగా నిలిచిన వారిపై కూడా భౌతిక దాడికి పాల్పడ్డారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో, డిజిపి, డిఐజి, ఎస్‌పి, కలెక్టర్‌కు రామానాయుడు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి నర్సాపురం డిఎస్‌పి శ్రీవేద విచారణ చేపట్టారు. ఈ కేసుపై లోతైన దర్యాప్తు జరపాలని, సిఐడి ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేస్తూ సిఐడి డిజిపి ఆదేశాలు జారీచేశారు.

శ్రీచైతన్య విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

భీమడోలు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణతో, యాజమాన్యాల సలహాలు, సూచనలతో ప్రణాళికాబద్ధంగా చదివేందుకు విద్యాబోధన చేయడం, ఉపాధ్యాయులు వ్యక్తిగత శిక్షణ ద్వారా వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దుతున్న కారణంగా విద్యార్థులు భవిష్యత్ కాలంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతున్నారని సీనియర్ అధ్యాపకులు ఆర్.ధనరాజ్ పేర్కొన్నారు. అమెరికా దేశానికి చెందిన అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా ప్రతి సంవత్సరం విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో నాసా కాంటెస్ట్ పోటీలను నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా మనదేశంలో నిర్వహించిన వివిధ అంశాల్లో స్పేస్ సెటిల్‌మెంట్ విభాగంలో పాల్గొన్న భీమడోలు చైతన్య విద్యాసంస్థలకు చెందిన ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులు స్పేస్ కాలనీ అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక వ్యాసాన్ని అందించారు. దేశస్థాయిలో ఈ పరిశోధనాత్మక వ్యాసానికి తృతీయ స్థానం లభించింది. ఈ మేరకు భీమడోలు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులను యాజమాన్యం తగు రీతిలో గురువారం సత్కరించింది. కార్యక్రమానికి ప్రిన్సిపల్ సోహిని అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.ధనరాజ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చైతన్య పాఠశాలల ఆర్ఐ ఉదయ భాస్కర్, ఎఒ ముఖేష్ కుమార్, డీన్ సత్యనారాయణ, సిసి స్వప్నప్రియ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రోటరీ క్లబ్ జంగారెడ్డిగూడెం ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్ బాబు, సెక్రటరీ సంధ్య ప్రవల్లిక ఆధ్వర్యంలో మన్య ప్రాంతమైన దొరమామిడి మండలం పందిరిమామిడిగూడెం గ్రామంలో సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు బెస్ట్ ఔట్ ఆఫ్ వేస్ట్ అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పెనుమర్తి సురేష్ బాబు మాట్లాడుతూ వారి వారి స్వగృహాల్లో వృథాగా పారవేసే చెత్త కాగితాలు, ఇతర వస్తువులతో విద్యార్థులు వారి సృజనాత్మకతను ఉపయోగించి కళాత్మకమైన, సందేశ పూర్వకమైన వస్తువులు తయారు చేశారన్నారు. వారిలో గెలుపొందిన ఐదుగురు బాలురకు, ఐదుగురు బాలికలకు ప్రథమ, ద్వితీయ విభాగంలో మెడల్స్, తృతీయ విభాగంలో బహుమతులు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్, అధ్యాపకులు శ్వేత, భాగ్యలక్ష్మి, మంగ, రాజు మాస్టర్ పాల్గొన్నారు.

ఎంఇఒను కలిసిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో విద్యా శాఖకు సంబంధించి సమస్యలు లేకుండా చూడాలని ఎంఇఒ-1 రామమూర్తిని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరార ు. ముసునూరు ఎంఇఒ-1గా ఇటీవల బాధ్యతల చేపట్టిన రామమూర్తిని ఆయన కార్యాలయంలో మండలంలోని ఉపాధ్యాయులు ఎస్‌టియు, డిపిఆర్‌టియు యూనియన్ శాఖల ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌టియు సీనియర్ నాయకులు సాయిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, కొత్త స్థానంలో చేరిన ఉపాధ్యాయుల వివరాలను త్వరగా పొందుపరిచి, వారి జీతాలను త్వరగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముసునూరు ఎంఇఒ-2 బివి.సుబ్బారావు, ఎస్‌టియు మండలాధ్యక్షులు జివి.రత్నం, ప్రధాన కార్యదర్శి కె.బాబూరావు, గౌరవ అధ్యక్షులు డి.భాస్కర్, డిపిఆర్‌టియు మండలాధ్యక్షులు జి.ఉదయ్‌భాస్కర్, ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జ్వరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వర్షాకాలంలో సంభవించే జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అశ్రద్ధ చేయవద్దని జయప్రకాష్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నీలిమ సూచించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏలూరులోని జయప్రకాష్ కాలనీలో ప్రజలకు డెంగీ జ్వరాల పట్ల అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ డెంగీ దోమలు నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. వారానికోసారి శుభ్రపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు పూర్ణ, విమల, ఆశా కార్యకర్తలు గంగారత్నం, ధనశ్రీ, నాగమణి పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌గా సురేష్ సేవలు విలువైనవి

ప్రజాశక్తి - మండవల్లి

ల్యాబ్ టెక్నీషియన్‌గా సురేష్ విలువైన సేవలను అందించారని తక్కెళ్లపాడు పిహెచ్‌సి సుమ, డాక్టర్ జోషిమా స్పష్టం చేశారు. మండవల్లి పిహెచ్‌సిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ విజయవాడలోని చుట్టుగుంట మలేరియా డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయిన బుద్ధుల సురేష్‌ను లోకుమూడి వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండవల్లి పిహెచ్‌సిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా సురేష్ ఆరేళ్ళు ఎంతో విలువైన సేవలందించారన్నారు. అనంతరం సురేష్‌తో పాటు బదిలీపై వెళ్లిన చంద్రశేఖర్ వీర్రాజులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

టీచర్లకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పెదవేగి(దెందులూరు)

నాగార్జున

ఇటీవల బదిలీ అయిన, ఉద్యోగోన్నతులు పొందిన టీచర్లకు జీతాలు చెల్లింపులో ఏర్పడిన జాప్యాన్ని నివారించాలని ఎస్‌టియు పెదవేగి మండలాధ్యక్షులు పి.నాగార్జున డిమాండ్ చేశారు. ఎస్‌టియు మండల కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్త పోషన్ల ఐడీలు లేనందువల్ల వారికి జీతాలు నిలిపివేయడంతో, ఆర్థిక శాఖ నుంచి జిఒ విడుదల చేసి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బదిలీలు, ఉద్యోగోన్నతుల పై జిల్లా అధికారులు వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్యాబినెట్ ఆమోదం వరకు వేచి చూడకుండా తొలుత జిఒ జారీచేసి, ఆ తర్వాత క్యాబినెట్‌లో రాటిఫై చేయాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

లారీపై నుంచి జారి పడి కూలీ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

లారీపై నుంచి జారి పడి కూలీ మృతి చెందిన ఘటన గురువారం దెందులూరు మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన నాగరాజు(43) చేపల ప్యాకింగ్‌కు వెళ్తుంటాడు. ఈ క్రమంలో గురువారం కూడా యథావిధిగా చేపల ప్యాకింగ్‌కు లారీలో బయలుదేరాడు. లారీ నాగ హనుమాన్ ఫ్యాక్టరీ సమీపంలో వంతెన కింద మలుపు తిరుగుతుండగా ప్రమాదవశాత్తు నాగరాజు జారి కింద పడటంతో అతని తలపై బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని తాపీమేస్త్రీ మృతి

ముసునూరు :ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చెక్కపల్లిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూజివీడు మండలం తుక్కులూరు గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ రాంబాబు(36) చెక్కపల్లిలో తాపీ పని ముగించుకుని బైక్‌పై నూజివీడుకు బయలుదేరాడు. ఈ క్రమంలో సొసైటీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ వద్దకు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో స్నానం చేస్తూ వ్యక్తి గల్లంతు

ముదినేపల్లి :కాలువలో స్నానం చేస్తూ వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని కొరరాద గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరరాద గ్రామానికి చెందిన మాదిరి వెంకటేశ్వరరావు బంధువు గురువారం మృతి చెందారు. వెంకటేశ్వరరావు దహన సంస్కారాల నిమిత్తం శ్మశానానికి వెళ్లాడు. అనంతరం కాలువలో స్నానం చేస్తూ నీటి ఉధృతికి గల్లంతయ్యాడు. కాలువలో స్నానం చేస్తున్న క్రమంలో కొంతమంది యువకులు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. వెంకటేశ్వరరావు కుమార్తె కనకదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి పెద్దిరాజు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రోడ్డు పక్కనే చెత్త.. తొలగించేదెవరూ!

డంపింగ్ యార్డున్నా వినియోగించని వైనం

దుర్వాసన, దోమలతో స్థానికుల అవస్థలు

అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

చెత్తను రోడ్డు పక్కన వేసేటప్పుడు డంపింగ్ యార్డు ఎందుకని చింతలపూడి నగర పంచాయతీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చింతలపూడి నగర పంచాయతీని రోల్ మోడల్‌గా చేయాలనే ఆలోచనలకు, ఆచరణలో అధికారులు అడుగులు వేయని పరిస్థితి నెలకొందని విమర్శిస్తున్నారు. చింతలపూడి నుంచి టి.నరసాపురం వెళ్లే దారి వెంబడి చెత్తను డంపింగ్ చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కనే చెత్తను, తదితర వ్యర్థాలను వేయడంతో దుర్వాసనతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు వృద్ధి చెందడంతో పలు రోగాలబారిన పడతామని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. చెత్త వేసే ప్రదేశంలో గతంలో చెరువు ఉండేదని, చెత్త వేయడంతో కనుమరుగవుతుందని స్థానికులు చెబుతున్నారు. చింతలపూడి నగర పంచాయతీలో డంపింగ్ యార్డ్ ఉన్నా చెత్తను రోడ్డు పక్కన వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెత్తను డంపింగ్ యార్డులో మాత్రమే వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీధిలైట్లు లేక ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు

మండలంలోని బోయగూడెం మెరకవీధిలో వీధి దీపాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధి లైట్లు వేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని జనసేన నేత చీదరాల మధుబాబు ఇటీవల సామాజిక మాధ్యమంలో లైవ్ పెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి నగర పంచాయతీలో వీధి దీపాల సమస్య లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజారోగ్యం పట్టదా..!

కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీసిన మున్సిపల్ వైస్ ఛైర్మన్

మాంసం విక్రయాల్లో నాణ్యత పరిశీలించాలి

పారిశుధ్య కార్మికులకు దుస్తులు, ఫినాయిల్, బూట్లు ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌ఛైర్మన్ సత్యనారాయణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజారోగ్యం గాలికి వదిలేసి.. పన్నులు కట్టించుకోవడం, ఆశీల ఆదాయంతోనే అధికారులు తల మునకలవుతున్నారని, ఈ పద్ధతి మారాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ అధికారులకు సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఛైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన గురువారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణంలో మాంసం విక్రయాల విషయంలో ఆశీల ఆదాయంపై అధికారులు దృష్టి సారించిన వేగంగా నాణ్యతా ప్రమాణాలు పరిశీలించడంలో ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులకు ఎప్పుడో ఇవ్వాల్సిన దుస్తులు, ఫినాయిల్, బూట్లు ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలన్నారు. ప్రజారోగ్యంపై ఎందుకు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజారోగ్యం అధికారుల బాధ్యత కాదా అని నిలదీశారు. మున్సిపల్, పశుసంవర్థక శాఖ, ఇతర శాఖల సమన్వయంతో మాంసం విక్రయాల్లో నాణ్యతా ప్రమాణాలను గుర్తిస్తూ ముద్రలు తప్పనిసరిగా వేయాలన్నారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు, బూట్లు, ఫినాయిల్‌లను తక్షణమే పంపిణీ చేయాలన్నారు. బిల్లులు కట్టలేదని పంపులకు డమ్మీలు వేసి కొత్తగా వాటర్ ట్యాక్స్ పే చేయాలంటూ నోటీసులు జారీ చేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. ఏ అంశంలోను అధికారులు తొందరపాటు చర్యలకు పాల్పడవద్దంటూ వైస్ ఛైర్మన్ సూచించారు. పట్టణంలో శానిటేషన్ ప్రక్రియ అస్తవ్యస్తంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పరిశీలించగా చేయగా 30 మంది సెలవులో ఉండగానే అందరూ హాజరైనట్లు చూపించడం వెనుక అర్థం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా అంశాల్లో వంద శాతం పారదర్శకత తప్పనిసరిగా పాటించాలన్నారు. రానున్న వినాయక చవితి, దసరా మహోత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లపై ఉన్న గుంతల్లో ప్యాచ్ వర్క్ నిర్వహించాలని రోడ్లు, భవనాల శాఖాధికారులకు సూచించారు. ఇప్పటివరకు చేసిన రోడ్ల ప్యాచ్ వర్క్‌ల వివరాలు కౌన్సిల్ ముందు ఉంచాలని కోరారు. మున్సిపల్ కౌన్సిలర్ గిరీష్‌కుమార్ మాట్లాడుతూ గత కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యలకు ఎంతవరకు పరిష్కారాలు లభించాయో కౌన్సిల్ ముందు ఉంచాలని కోరారు. ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం, సభ్యులు లేవనెత్తిన అంశాలపై చర్చలు కొనసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలి

ప్రజాసంఘాల నేతలు


బుట్టాయగూడెం : మాట్లాడుతున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలని ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. బుట్టాయగూడెం రామనరసయ్య భవనంలో ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం కారం రాఘవ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మల సురేష్, రైతు సంఘం నాయకులు తెల్లం రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తెల్లం మునేశ్వరరావు, రైతు కూలీ సంఘం నాయకులు సముద్రాల సుబ్బారావు, ఎఐకెయుఎస్ నాయకులు కట్టం వీరస్వామి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలని, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మొడియం నాగమణి, కారం భాస్కర్, పిఒడబ్ల్యు, పివైఎల్, పిడిఎస్‌యు, ఐఎఫ్‌టియు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి :స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. పేదల ఇళ్లల్లో అధికారులు స్మార్ట్ మీటర్లను బిగించాలని చూస్తే వాటిని బద్దలు కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, కారం దారయ్య, భూషణం, అప్పారావు, నాగేశ్వరరావు, తెల్లం శంకరుడు, కారం బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి :స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఎం, సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పి.పాండురంగారావు, కంచర్ల గురవయ్య అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు మాట్లా డుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు విధానానికి వ్యతిరేకంగా ఆగస్టు ఐదో తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 28న పట్టణంలో, 29న ప్రగడవరంలో 30న ఎర్రగుంటపల్లిలో, 31న రాఘవపురం గ్రామాల్లో సంతకాలు సేకరించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్. సత్యనారాయణ, ఐద్వా నాయకురాలు వరలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.సత్యనారాయణ, సిపిఎం నాయకులు ఎస్.సూర్యకుమార్, సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్, సిపిఐ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజానాట్యమండలి, ఎఐవైఎఫ్, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : పట్టణంలోని సిపిఐ కార్యాలయం వద్ద గురువారం ప్రజా సంఘాల ఐక్యవేదిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, అఖిలభారత రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసి తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని, లేకపోతే విద్యుత్ ఉద్యమంలో భాగంగా ఆగస్టు ఐదో తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా నాయకులు వి.సద్గురు, ప్రధాన కార్యదర్శి కురసం లత, ఆదివాసీ భారత మహాసభ రాష్ట్ర కార్యదర్శి మడకం రామన్న, ఎఐటియుసి, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రగతిశీల యువజన సంఘం, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై టౌన్ సిఐ సత్యశ్రీనివాస్, ఎస్ఐ నాగేశ్వరరావు, సిబ్బందితో కలిసి గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరానికి గురైతే పోలీసులకు, 1930 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

చింతలపూడి :ఒటిపిలు, ఖాతా వివరాలు ఎవరితోనూ పంచుకోకూడదనే విషయాన్ని ఖాతాదారులకు చెప్పే విధంగా మేనేజర్లు పని చేయాలని చింతలపూడి సిఐ క్రాంతికుమార్ సూచించారు. మండలంలోని అన్ని బ్యాంకుల మేనేజర్లతో సైబర్ నేరాలు, భద్రత అంశాలపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అనుమానాస్పద లావాదేవీలపై వెంటనే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎస్ఐ సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

పేద వ్యక్తి దహన సంస్కారానికి ఆర్థిక సాయం అందించిన వైనమిది. మండలంలోని విశ్వనాధునిపాలెం గ్రామానికి చెందిన గుడివాడ సుబ్రహ్మణ్యం(45) కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని కుటుంబం మట్టి ఖర్చులు భరించలేని స్థితిలో ఉండి అంబుల వైష్ణవిని ఆర్థిక సాయం కోరగా వెంటనే స్పందించిన అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి తమ తండ్రి డాక్టర్ మనోజ్‌తో మాట్లాడి వెంటనే తక్షణ సాయం కింద రూ.ఐదు వేల నగదును వారి కుటుంబసభ్యులకు అందించారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మాదాసు శ్రీనివాసు, ఉపాధ్యక్షులుగా గుండె మహారాజు, గౌరవ అధ్యక్షులుగా పరసా చందు, కార్యదర్శిగా పలగాని ప్రసాద్, కోశాధికారిగా బొమ్మిడి ఈశ్వర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జట్ల మహేష్, పిచుకుల భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో కూటమి విఫలం'

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎన్నికల హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైసిపి యువ నాయకులు పెండ్యాల అభిషేక్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక కొత్త పింఛన్లు ఇవ్వకుండా వెరిఫికేషన్ పేరుతో ఉన్నవి తొలగిస్తున్నారని తెలిపారు. మిథున్ రెడ్డిపై సిఎం చంద్రబాబు అక్రమ కేసులు బనాయించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

ఘనంగా వెంకటరమణయ్య జయంతి వేడుకలు

ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహులు, గ్రంథాలయ ఉద్యమకారులు, బహుముఖ ప్రజ్ఞాశాలి పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వెంకటరమణయ్య విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎం.శేఖర్‌బాబు మాట్లాడారు. అనంతరం పాఠకులకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారా యణరావు, విటి.సందీప్ కుమార్, కార్యాలయ సిబ్బంది, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

భీమడోలు : తమ కాలంలో తమకు ఆసక్తి కలిగిన రంగాల ద్వారా సమాజాభివృద్ధికి, ప్రజలను చైతన్యపరచటానికి ప్రముఖులు చేసిన సేవలు ప్రస్తుత కాలానికి సైతం ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య 135వ జయంతి, సర్ ఆర్థర్ కాటన్ 126వ వర్ధంతి, కవి గుర్రం జాషువా 54వ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి గ్రంథ పాలకులు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ టివి.ఉమామహేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది సంపదరావు హాజరయ్యారు. తొలుత అతిథులతో పాటు పలువురు వక్తలు, పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి సత్కరించారు.

దెందులూరు :గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకట రమణయ్య ఎంతో కృషి చేశారని గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్‌బాబు అన్నారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో వెంకట రమణయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెంకటరమణయ్య చిత్రపటానికి జాన్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాబోధన అర్థమయ్యే రీతిలో ఉండాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అభ్యసనాలను ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో బోధించాలని మానిటిరింగ్ డైట్ లెక్చరర్ జోజిబాబు అన్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న కార్యక్రమాలను ఆయన గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. ఎస్ఆర్‌కెవిఎం కిట్ల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, గతేడాది ఎస్ఎస్‌సి ఫలితాలు, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ గురించి అడిగి తెలుసుకున్నారు. సంసిద్ధత కార్యక్రమాన్ని ఈ నెల 31 వరకు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం డి.శైలజ, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కొలకలూరి రాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు పొందడంపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని తుక్కులూరులో టైలరింగ్ శిక్షణ మొదటి బ్యాచ్ విజయవంతంగా పూర్తి కావడాన్ని పురస్కరించుకుని బ్యాంకర్లతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ పాల్గొని శిక్షణ పొందిన మహిళలకు ఆర్థిక ఆదాయాన్ని పెంచుకునే మార్గాలు, బ్యాంకు రుణాలు పొందే విధానాలను వివరించారు. వెలుగు, స్వయం సహాయక సమూహం సభ్యులకు బ్యాంకుల ద్వారా ప్రత్యేకంగా రుణాలు పొందే అవకాశం ఉందన్నారు.

'వైసిపి నేతలపై అక్రమ కేసులు తగవు'

ఏలూరు సిటీ :కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో వైసిపి నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించడం తగదని వైసిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయప్రకాష్ అన్నారు. ఏలూరులోని వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు లిక్కర్ స్కామ్ చేస్తున్నారన్నారు. మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వైసిపి నాయకులను, కార్యకర్తలను భయపెట్టలేరన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జుజ్జువరపు విజయనిర్మల, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయి సుధీర్‌బాబు, వైసిపి రాష్ట్ర క్రిస్టియన్ సెల్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పడిపోయినవి

గుండుమోగుల శివకుమార్, తండ్రి: వీర వరప్రసాద్, 1-62, తోకలపూడి, వీరవాసరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ - 534247 నివాసి అయిన నేను 2025 జూలై 23న తోకలపూడి నుండి వీరవాసరం వెళ్తూ, నా వద్ద ఉన్న ఆస్తి పత్రాలు ఉన్న ఒక కవర్‌ను మోటార్ సైకిల్‌పై వీరవాసరానికి జిరాక్స్ కోసం తీసుకెళ్తున్న సమయంలో కోల్పోయాను. ఆ కవర్‌లో ఉన్న పత్రాలు 1) 12-03-2020 తేదీతో డాక్యుమెంట్ నెం.866, అంబాజీపేట ఎస్.ఆర్.వో.లో రిజిస్ట్రేషన్ అయిన అసలు విభజన పత్రం (పార్టిషన్ డీడ్) 2) 12-04-2021 తేదీతో డాక్యుమెంట్ నెం.1265, వీరవాసరం ఎస్.ఆర్.వో.లో రిజిస్ట్రేషన్ అయిన అసలు రిజిస్టర్డ్ సేల్ కమ్ జి.పి.ఎ. పత్రం. పై రెండు అసలు పత్రాలు ఎవరికైనా దొరికినట్లయితే, దయచేసి నన్ను సంప్రదించి నా వద్దకు అందజేయగలరు.

ఆస్తి వివరాలు

వీరవాసరం ఎస్.ఆర్.వో. పరిధిలోని తోకలపూడి గ్రామం, సర్వే నం. 76-ఎ లో 227.67 చదరపు గజాలలో ఉన్న డోర్ నెం.1-62రు ఆర్.సి.సి. ఇల్లు. **ఇల్లు సరిహద్దులు : ఉత్తరం:** నీటి కాలువ, **దక్షిణం:** గన్నబత్తుల స్వప్న గారి ఇల్లు, **పడమర:** రోడ్డు, **తూర్పు:** గుండుమోగుల శ్రీహరి సంబంధిత స్థలం (ఇల్లు సహా).

గుండుమోగుల శివకుమార్,
S/o వీర వరప్రసాద్, డోర్‌నెం.:1-62, తోకలపూడి,
వీరవాసరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, సెల్: :6362557224

అవాంతరాలు లేకుండా సాగునీరు సరఫరా

ప్రజాశక్తి - దెందులూరు

సాగునీటి సరఫరాకు ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉండటం కోసం ఏలూరు కృష్ణా కాలువలో ట్రాక్టర్లతో దమ్ము చేయిస్తామని, దీని ద్వారా కృష్ణా కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులకు అవాంతరాలు లేకుండా సాగు నీరు అందించేందుకు వీలు అవుతుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలంలోని పెరికీడు నుంచి కలపర్రు, గోగులంపాడు, ఏలూరు వరకు కృష్ణా కాలువలో నాచు తొలగించి దమ్ము చక్రాల ట్రాక్టర్లతో కాలువను దమ్ము చేయించే పనులను చేపట్టారు. ఇలా చేయడం ద్వారా నీటి ప్రవాహానికి అడ్డు తొలిగి దిగువ ప్రాంత రైతులకు నీరు సులభంగా చేరుతుందని తెలిపారు. డిసి ఛైర్మన్ బొప్పుడి కాశీబాబు, నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్, పునుకొల్లు సర్పంచి కంభంపాటి సునీల్‌కృష్ణ, అక్కినేని కృష్ణమోహన్, రావడ గాంధీ, సత్యవోలు ఎంపిటిసి రంభ నాగరాజు పాల్గొన్నారు.

దాచారంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని దాచారం గ్రామ పంచాయతీలో ఎంపిడిఒ నరసింహారావు ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం రెండోరోజు గురువారం పర్యటించింది. ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ సెంటర్, ఆరోగ్య కేంద్రం, చర్చి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, గ్రామపంచాయతీలో శానిటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ అధికారి సునీల్ మాట్లాడుతూ బెస్తగూడెం పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పిల్లలకు ఇచ్చే కోడిగుడ్లు పాడైపోయాయన్నారు. మంచి కోడిగుడ్లు మాత్రమే పిల్లలకు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సారమ్మ, స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ మెంబర్ మధుప్రియ, పంచాయతీ కార్యదర్శులు శ్రీరామచంద్రమూర్తి, రమేష్, ఎంఆర్‌సి రమేష్, సిడిపిఒ లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు గుర్రం జాషువా

ప్రజాశక్తి - చింతలపూడి

కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడిన మహనీయుడు గుర్రం జాషువా అని చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు అన్నా రు. కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో కవి కోకిల గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపల్ పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె. నరేంద్రకుమార్, ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ మీర్ హసీం, ఆంగ్ల శాఖధిపతి బి.శ్రీనివాసరావు, తెలుగు అధ్యాపకురాలు బి.సరస్వతి పాల్గొన్నారు.

పి-4పై గ్రామసభ

వేలేరుపాడు రూరల్ :పేదరికం నిర్మూలన, ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పి-4 కార్యక్రమాన్ని చేపట్టిందని రుద్రంకోట పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరావు అన్నారు. రుద్రంకోట గ్రామ పంచాయతీ కార్యాలయంలో వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పి-4 కార్యక్రమంపై గురువారం గ్రామసభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్తులు గ్రామాభివృద్ధికి సహకరించలన్నారు.

మహారాజశ్రీ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు, ఏలూరు జిల్లా.

I.A.No.919/24 in O.S.No.411/2017

బిట్వీన్ :
దాసరి వెంకటేశ్వరరావు & 14 వగైరా ...Petitioners
And
ముల్పూరి శ్రీకృష్ణ వాసుదేవ వరప్రసాదరావు & 21 వగైరా ...Respondent

R1: ముల్పూరి శ్రీక్రిష్ణ వాసుదేవ వరప్రసాదరావు, S/o.బాలశంకరరావు, R/o.D.No.3-136-6-37, ఏపూరు (V), పెదపాడు, (M) ఏలూరు జిల్లా,

కోర్టు ప్రకటన

పై నంబరు దావాలోని IA ను Decree Amandment చేయమని కోరుచూ దాఖలు చేసిన పై నంబరు IA లో 1వ ప్రతివాదికి ఎన్నిసార్లు కోర్టు వారు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ఆర్డర్ వేసినారు. పై నెంబర్ IAలో 1వ ప్రతివాదికి ఏమైన అభ్యంతరము ఉన్నయెడల ది.**12-08-2025**వ తేది ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనియడల మీకు పరోక్షముగా ఆర్డరు పాస్ చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

Sri D.Prabhakar,
Eluru Advocate, Eluru.
Dt.23-07-25 Cell: 9440184345

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం, ప.గో.జిల్లా

ఇ.పి.నెం.5/2020 ఇన్ ఓ.యస్.నెం.249/2014

బిట్వీన్ :
బొప్పూడి సుబ్బారావు ...పిటీషనర్/DHR
మరియు
శలా బసవ కోట శంకరయ్య ...రెస్పాండెంట్/JDR

సమన్స్ టు :
రెస్పాండెంట్/JDR : శలా బసవ కోట శంకరయ్య, S/o.బసవ కోటయ్య, పురుషుడు, వయస్సు 55 సం.రం., బిజినెస్, దగ్గులూరు, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.

పై నెంబరు గల ఇ.పిలో DHR కి మీ నుంచి రావలసిన డిక్రీ బాకీ నిమిత్తం మీకు చెందిన పై నెంబరు ఇ.పి షెడ్యూల్ ఆస్థిని వేలం వేయుట ద్వారా బాకీని వసూలు ఇప్పించమని కోరుతున్నందున సదరు ఇ.పి.లో శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు రిజిష్టర్ పోస్ట్ ద్వారాను, మరియు శ్రీ కోర్టు వారి ద్వారాను రూల్ 64 సేల్ నోటీసులు పంపించినప్పటికి ఇ.పి నోటీసులు మీరు తీసుకోకుండా కాలయాపన చేస్తునందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది.06-08-2025** సం.తేదీన ఉదయం 10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని, కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు ఇ.పి విచారించబడి, తీర్మానించబడునని మీకు తెలియజేయుచున్నాము.

జి.పి.సుదర్శనరావు
పిటీషనర్ తరపున న్యాయవాది,
స్థలం : నరసాపురం నరసాపురం
తేదీ : 25-07-2025 సెల్: 9985649898